క్లుప్తంగా

శివాలయంలో సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న జడ్జి అనిత

నర్సాపూర్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజారి వీరప్పగురూజీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. తొలి ఏకాదశి, మొహర్రం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్యకు పాదయాత్ర


అయోధ్యకు వెళ్తున్న శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): ఎంపీగా రఘునందన్ రావు గెలుపుపై మొక్కును తీర్చుకునేందుకు బీజేపీ నాయకుడు శ్రీనివాస్ అయోధ్యకు బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. అల్వాల్‌లోని శివాలయం వద్ద చేగుంట నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రఘునందన్‌రావు గెలిస్తే అయోధ్యకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నట్లు తెలిపారు. మొక్కును తీర్చుకునేందుకు 1400 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భూపాల్, చంద్రశేఖర్, సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రతన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మొక్కల పంపిణీ


మొక్కలు అందజేస్తున్న సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): వనమహోత్సవంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో ఈజీఎస్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం చురుకుగా సాగుతోంది. బుధవారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. ఖాళీ స్థలాలలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సన్మానించిన అధికారులు

నర్సాపూర్: ఆర్టీసీలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. స్థానిక డిపోలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో డీఎస్పీ రాజేశ్, అటవీశాఖ డీఎఫ్‌ఓ రవీందర్, డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుధ పాల్గొని సన్మాన గ్రహీతలకు మెమెంటోలు అందజేశారు. అంతనంతరం వారు అటవీ మార్గంలో బస్సులు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

అధికారికంగా నిర్వహించండి


నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): ఏకలవ్యుడి జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించి గౌరవించాలని మండలంలోని చందంపేట ఏకలవ్య యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఏకలవ్యుడి జయంతిని పురస్కరించుకొని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింహులు, ఎల్లం, శ్రీకాంత్, రమేశ్, శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ సర్పంచ్ బీంరెడ్డి సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె చెంచెల్చెర్వుపల్లిలో మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత షరతులు విధించడం సరికాదన్నారు.

అస్తవ్యస్తంగా ప్రాథమిక విద్య

పేదల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కొన్ని స్కూళ్లు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. కాని కొన్ని గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారింది. టీచర్లు ఉంటే విద్యార్థులు ఉండరు, విద్యార్థులు ఉంటే టీచర్లు ఉండని దుస్థితి. ఒకే ఒక్క టీచర్‌తో ఐదు తరగతులు నిర్వహించడం, టీచర్ సెలవుపెట్టినా, విధుల్లో భాగంగా ఎక్కడికైనా వెళ్లినా మూతపడాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల పాఠశాల మూతపడినా అది కొనసాగుతున్నట్టు రికార్డులలో చూపించడం మరీ విచిత్రమైన పరిస్థితి.

– అల్లాదుర్గం(మెదక్)



విద్యార్థులు, టీచర్ లేక మూతపడిన పల్లెగడ్డ పాఠశాల

- మొత్తం 22 పాఠశాలలు
- 14 పాఠశాలల్లో సింగిల్ టీచర్
- మూడు బడులు మూత
- చిన్నారులకు అందని విద్య


అభివృద్ధి పనులు చేసినా మూతపడిన కాన్షీరాంనగర్ పాఠశాల


రికార్డులలోనే.. చౌటాక్ తండా పాఠశాల

అల్లాదుర్గం మండలంలో 22 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 14 పాఠశాలలు ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో కొనసాగుతున్నాయి. విద్యార్థులు లేక మూడు ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ఉంటే టీచర్లే పక్క పాఠశాలలో చేర్పించి పాఠశాలను మూతపడేలా చేశారనే ఆరోపణలు లేక పోలేదు. విద్యార్థులు లేరని టీచర్లు చెప్పడంతో ఎలాంటి విచారణ చేయకుండా జిల్లా అధికారులు పాఠశాలలను మూసివేసి ఆయా టీచర్లను మరో పాఠశాలకు డిప్యూటేషన్ వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

➡ చౌటాక్ తండా పాఠశాలలో టీచర్ ఉన్నా విద్యార్థులు లేక మూతపడింది. ఈ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థులను పక్కన ఉన్న మందాపూర్ పాఠశాలకు పంపించి టీచర్ అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాథమిక పాఠశాల మూతపడినా రికార్డులలో మాత్రం ముగ్గురు విద్యార్థులతో కొనసాగుతున్నట్లు చూపించడం గమనార్హం.

➡ అల్లాదుర్గం కాన్షీరాంనగర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుడు లేక మూతపడింది. ఒక ఉపాధ్యాయుడు ఉండగా ప్రస్తుతం బదిలీలో ఉపాధ్యాయుడు సహితం బదిలీపై వెళ్లారు. మన ఊరు–మన బడి పథకం కింద రూ.4లక్షలు ఖర్చుపెట్టి కిచెన్ షెడ్, టాయ్‌లెట్లు, తాగునీటి సౌకర్యం పనులు చేపట్టడం విశేషం.

➡ పల్లెగడ్డ(కుసంబీనగర్) పాఠశాల విద్యార్థులు లేక 2019 నుంచి 2022 వరకు మూతపడింది. 2022 జూన్‌లో ఇద్దరు విద్యార్థులు ఒక ఉపాధ్యాయుడితో కొనసాగింది. 2023 నుంచి మళ్లీ పాఠశాల మూతపడింది. ఇక్కడ పని చేసిన ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లారు.

➡ ఇటీవల సీతానగర్ పాఠశాల ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లడంతో మూతపడిన విషయం తెలిసిందే. మరో పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ వేశారు. అయితే ఆయన విధులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టిపెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

200 మందికి రుణమాఫీ

- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు
- ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రైతు రుణమాఫీకి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రూ.1లక్ష లోపు రైతులకు రుణమాఫీ చేయనుండడంతో స్థానిక రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఏడీఏ పుణ్యవతి, ఏఓ స్వప్న, ఏఈఓలు టీవీ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సిద్ధంచేసి ట్రయల్‌రన్ నిర్వహించారు. గురువారం రెండు వందల మంది రైతులకు రుణమాఫీపై చేయనున్నట్లు ఏడీఏ తెలిపారు.


ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

రుణమాఫీ సంబురాలు

కొల్చారం(నర్సాపూర్)/రామాయంపేట(మెదక్)/టేక్మాల్(మెదక్)/పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గురువారం నుంచి రుణమాఫీకి సీఎం శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ సంబురాలు నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రామాయంపేట వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చూడవచ్చని చెప్పారు. అలాగే టేక్మాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రుణమాఫీ సంబురాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయిపల్లి రైతువేదికలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే సంబురాలకు సంబంధించి ఇన్‌చార్జి ఏఓ యాదగిరి ఏర్పాట్లు పూర్తిచేశారు. వీడియో కాన్ఫరెన్స్ ట్రయల్ రన్ నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డితోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైను పగిలి నిలిచిన నీటి సరఫరా

నర్సాపూర్: పైపులైను పగలడంతో పట్టణంలోని పలు వార్డులకు నీటి సరఫరా నిలిచిపోయింది. 7, 8, 9 వార్డులలో నీటి సరఫరా లేక మూడు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తొలిఏకాదశి, మొహర్రం పండుగల పూటకూడా నీటి సరఫరా లేకపోవడంపై ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. పైపులైను పగిలి మూడు రోజులు గడుస్తున్నా మున్సిపాలిటీ అధికారులు స్పందించకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్షంవల్లే తమకు నీళ్లు రావడంలేదని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జైత్‌రాం నాయక్‌ను వివరణ కోరగా నర్సాపూర్‌కు చెందిన ఓ రైతు జేసీబీ ద్వారా తన పొలానికి పైపులైను వేసుకునేందుకు తవ్వకాలు జరపడంతో పైపులు పగిలి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. బుధవారం పైపులైనుకు మరమ్మతులు చేయించామని, మూడు వార్డులలో వంతుల వారిగా నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు ఆయన తెలిపారు.

బ్లాస్టింగ్‌తో ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): అనుమతులు లేకుండా పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బండరాళ్ల బ్లాస్టింగ్‌లకు పాల్పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమీప రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన శివ్వంపేట పూర్వ పంచాయతీ పరిధిలోని భూములను పలువురు రి యల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆ భూముల్లో ఉన్న బండరాళ్లను తొలగించేందుకు వారు బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. బుధవారం చేపట్టిన పేలుళ్ల మూలంగా బండరాళ్లు వచ్చి సమీప పొలాల్లో పడ్డాయని రైతులు వాపోయారు. శబ్దాల వల్ల గిరిజన తండాల వాసులు, గ్రామస్తులు ఆందోళకు గురికావల్సి వచ్చింది. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఆదరించినవారికి అండగా ఉంటా..

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): తనను ఆదరించిన మెదక్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా తనవంతు సహాయ సహకారాలు చేస్తూ అండగా ఉంటానని ఎమ్మెల్యే రోహిత్‌రావు భరోసా ఇచ్చారు. ఇటీవలే మండలం పరిధిలోని పేరూర్ గ్రామానికి చెందిన రైతు వెల్మకన్నె నరేశ్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడి కుటుంబానికి తనవంతుగా రూ.2లక్షలు ఇస్తానన్న హామీ మేరకు బుధవారం మృతుడి కుటుంబానికి చెక్కును అందజేశారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆయన వెంట పార్టీ నేతలు శ్రీనివాస్‌చౌదరి, శంకరప్ప, ఆంజనేయులు, రాంచందర్‌రావు తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం

త్యాగానికి ప్రతీకగా నిలిచిన మొహర్రంను కులమతాలకు అతీతంగా బుధవారం జిల్లావ్యాప్తంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చాలా చోట్ల మహ్మద్ ప్రవక్త కుటుంబ సభ్యుల మరణాన్ని స్మరిస్తూ గ్రామాల్లో పీర్లను ప్రతిష్టించి ఊరేగించారు. డప్పు చప్పుళ్ల నడుమ ఆటపాటలతో ప్రజలు దులాటలు ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. పెద్దలు, యువకులు పీర్లను ఎత్తుకొని నృత్యాలు చేశారు. వేడుకల్లో బెల్లాన్ని ప్రసాదంగా పంచిపెట్టారు


టేక్మాల్(మెదక్): టేక్మాల్‌లో పీర్ల ఊరేగింపు


వెల్దుర్తి -మంగళపర్తిలో ..


పాపన్నపేట(మెదక్): మల్లంపేటలో..


గేటు వద్ద పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు

అనుమతి ఇవ్వకపోవడం దారుణం

- ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

శివ్వంపేట(నర్సాపూర్): హాస్టల్లో ఉన్న తమ పిల్లలను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోవడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా సెలవు దినం కావడంతో మండల పరిధి గూడూర్ గ్రామంలో కస్తూర్బా బాలికల వసతి గృహంలో చదువుకుంటున్న వారి తల్లిదండ్రులు పిండి వంటలు తీసుకుని వచ్చారు. కాని తమ పిల్లలను కలుసుకునేందుకు హాస్టల్ సిబ్బంది అనుమతి ఇవ్వలేదు. దీంతో ప్రధాన గేటు వద్ద పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడుతూ పండుగ వేళ తమ పిల్లలను కలిసేందుకు వస్తే అనుమతి ఇవ్వకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ప్రహరీని ఆనించి తమ బైక్‌లను పార్క్‌చేసి దానిపైకిఎక్కి తమ చిన్నారులతో మాట్లాడారు. తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించి ఆదివారం కలిసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు చెప్పుతున్నారు.


బైక్ పైకిఎక్కి గోడపై నుంచి మాట్లాడుతున్న మహిళ

రెండో శనివారం మాత్రమే అనుమతి

ప్రతీ నెలలోను రెండో శనివారం మాత్రమే విద్యార్థినులను కలిసేందుకు తల్లిదండ్రులకు అనుమతిస్తున్నాం. అలా కాకుండా పండుగ రోజులు, ఆదివారాలు, సంత రోజున తల్లిదండ్రులు వస్తే అనుమతి ఇవ్వడం లేదు. దీనిని అర్థం చేసుకుని సహకరించాలి. – మంజుల, ప్రిన్సిపాల్

ఆరో రోజుకు చేరిన రిలే దీక్షలు


దీక్ష చేస్తున్న రైతులు

నర్సాపూర్: సంగారెడ్డి రీచ్–2 కాలువ వద్దంటూ ఆయా గ్రామాల రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం నాటికి ఆరో రోజుకు చేరాయి. భూమి తీసుకుంటే భూమికి భూమి ఇవ్వాలని లేని పక్షంలో ఎకరానికి రూ.60 నుంచి రూ.70లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్‌తో రైతులు దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్ దీక్షలో పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. బ్రాహ్మణపల్లి, చిన్న చింతకుంట గ్రామాలకు చెందిన రైతులు రాంకిషన్, మహేశ్ గౌడ్, కొండల్, నరసింహారెడ్డి, స్వామి, అర్జున్, శ్రీకాంత్‌రెడ్డి, నగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి లక్ష తులసి పూజ

- ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లోని నామాలగుండు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామికి లక్ష తులసి పత్రాలతో పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ అర్చకుడు మురళీధర ఆచార్యులు ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సహస్రనామ పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా జరుకున్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది తరువాత మొదటగా వచ్చే పండుగ తొలి ఏకాదశి అని ఇక నుంచి పండుగలను ప్రారంభమవుతాయని చెప్పారు.


కౌడిపల్లి: తులసి దళాలతో పూజలు

రుక్మిణీ విఠలేశ్వరాలయంలో..


పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక శ్రీరుక్మిణీ విఠలేశ్వరాలయంతోపాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు సాయంత్రం ఉపవాస దీక్షలను విరమించి, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని స్వామివారిని వేడుకున్నారు.

పద్మనాభస్వామి ఆలయంలో..

పాపన్నపేట(మెదక్): మండలంలో ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. నాగ్సాన్‌పల్లి పద్మనాభ స్వామి ఆలయంలో రంగంపేట పీఠాధిపతి స్వామి మాధవానంద సరస్వతి కమలం పూలతో అర్చన చేశారు. ఆయా గ్రామాల్లో ఉపవాస్య దీక్షలు చేపట్టిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షాలు కురవాలని..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు అన్ని గ్రామాల్లోను బుధవారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పలువురు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టారు. దివంగతులైన వారి ఇంటి పెద్దల పేరిట నైవేద్యం పెట్టి పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని యువకులు కబడ్డీ, చిర్రాగోనేతోపాటు పలు క్రీడలతో సందడి చేశారు.


పెద్దశంకరంపేటలో పూజలు చేస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలి

- శాసన మండలి సభ్యుడు రఘోత్తంరెడ్డి

మర్కూక్(గజ్వేల్): ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి పరిఢవిల్లుతుందని ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని శాసన మండలి సభ్యుడు కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని భవానందాపూర్ గ్రామంలో శ్రీపాండురంగస్వామి ఆషాఢ ఉత్సవాలకు హాజరయ్యారు. రుక్మిణీ పాండురంగ స్వామికి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాండురంగ స్వామి కృపాకటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు ఆయనను శాలువాతో సత్కరించారు. ఉదయం స్వామి వారికి తొలి ఏకాదశి సందర్భంగా విశేష పూజ, అఖండ భగవన్నామం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.


రుక్మిణీ పాండురంగ స్వామి సన్నిధిలో శాసన మండలి సభ్యుడు రఘోత్తంరెడ్డి